BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU
మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ 13-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
ANN తెలుగు

# సమ్మక్కను దర్శించుకున్న సీతక్క


- వన దేవతలకు ప్రత్యేక పూజలు
- మేడారం జాతరకు భారీ ఏర్పాట్లు చేశాం : మంత్రి



**మహా, ములుగు :** తెలంగాణ కుంభమేళా సమ్మక్క సారలమ్మ మినీ మేడారం జాతరకు జనం పోటెత్తారు. గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వన దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మినీ మేడారం జాతరకు 10 నుంచి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జాతర పరిసరాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నాణ్యమైన వైద్య సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంచామన్నారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా చోరీలు జరగకుండా చూడాలని పోలీస్ అధికారులను మంత్రి అప్రమత్త చేశారు. జంపన్న వాగు, గద్దెల ప్రాంతం, మేడారం పరిసర ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులచే నిరంతరం శుభ్రంచేయించాలని తెలిపారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చిన పక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లోనే నిలిపేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో గద్దెల ప్రాంతంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిర్లను ఏర్పాట్లు చేశామని తెలిపారు. దాదాపు 5 కోట్ల 30 లక్షల రూపాయలతో వివిధ పనులను పూర్తి చేశామని వివరించారు. త్రాగునీటి కొరత ఏర్పడకుండా నిరంతరం నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు హనుమకొండ జిల్లా కేంద్రం నుండి నిరంతరం బస్సులను మేడారం నడిపించనున్నారని, జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. వనదేవతలను దర్శించుకుని సురక్షితంగా ఎవరి ఇండ్లకు వారు వెళ్లే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని సీతక్క తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ అత్రం సుగుణ , కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ గారితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కోర్టుకు మంత్రి కొండా సురేఖ

## నాగార్జున పరువు నష్టం కేసు..



**మహా, హైదరాబాద్ :** నటుడు అక్కినేని నాగార్జున వేసిన పరువు నష్టం కేసులో మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. గురువారం నాంపల్లి స్పెషల్ కోర్టులో స్పెషల్ జడ్జి ఎదుట విచారణకు హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను విమర్శించే క్రమంలో కొండా సురేఖ నాగార్జున కుటుంబంపై కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సమంత, నాగచైతన్య విడిపోయేందుకు కారణం కేటీఆరేనని కొండా సురేఖ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. సురేఖ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హీరో నాగార్జున, కేటీఆర్ లు వేర్వేరుగా మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దాఖలు వేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు తన కుటుంబాన్ని ఎంతగానో బాధించాయని.. ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాగార్జున తరపు న్యాయవాది అశోక్ రెడ్డి కోర్టులో ఇప్పటికే కోర్టులో తమ వాదనలు వినిపించారు. నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఈ కేసులలో నాగార్జున సహా కేటీఆర్, సాక్షుల వాంగ్మూలాలు తీసుకున్న కోర్టు మంత్రి కొండా సురేఖను కూడా కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరై ఆమె చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కొండా సురేఖ, తన లాయర్ గురుప్రీత్ సింగ్ తో కలిసి కోర్టుకు హాజరయ్యారు.

# మోహన్ బాబుకు.. సుప్రీంకోర్టులో ఊరట



**మహా, న్యూఢిల్లీ :** సినీ నటుడు మోహన్‌బాబుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన సుప్రీంకోర్టు లో పిటీషన్ వేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసును జస్టిస్ సుదాంశ్ దులియా ధర్మాసనం విచారణ జరిపింది. గత విచారణ సందర్భంగా మోహన్‌బాబుపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు తెలంగాణ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా జర్నలిస్ట్‌పై జరిగిన దాడికి తాను బహిరంగంగా క్షమాపణ చెప్పానని.. నష్ట పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని మోహన్ బాబు ధర్మాసనానికి చెప్పారు.
**ఇదీ జరిగింది..** గత ఏడాది డిసెంబరు 10న మోహన్ బాబు తనయుడు మంచుమనోజ్ విజ్ఞప్తి మేరకు ఆయన వెంట మీడియా మోహన్‌బాబు ఇంటికి రాగా ఆయన ఒక విలేకరి దగ్గరున్న మైక్‌ను లాక్కొని తల మీద కొట్టారు. తీవ్ర గాయాల పాలైన విలేకరిని ఆస్పత్రిలో చేర్చారు. రాచకొండ పోలీసులు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసుకుసంబంధించి కోర్టులో వాదనల సందర్భంగా జర్నలిస్టు రంజిత్ తరపు న్యాయవాది వాదిస్తూ, మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని కోరారు. జర్నలిస్టుపై దాడి చేయడమే కాకుండా గొంతు పట్టి నులిమారని చెప్పారు. ఈ మేరకు ఇరు వర్గాలు అఫిడవిట్లు దాఖలు చేశాయి. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసు కావడంతో డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసే అవకాశం లేదు. దీంతో ముందస్తు బెయిలు కోసం మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# ఫ్యూచర్ ఏఐదే



## హైదరాబాద్ ప్రగతిలో మైక్రోసాఫ్ట్ మరో మైలురాయి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

**మహా, హైదరాబాద్:** భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు. హైదరాబాద్ లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జర్నీలో ఇదొక మైలురాయిగా వర్ణించారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందన్నారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని చెప్పారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నట్లు సీఎం తెలిపారు. మైక్రోసాఫ్ట్ తెలంగాణ




ప్రభుత్వం ఇప్పుడు ఏఐ ఫౌండేషన్ అకాడమీతో భాగస్వాములుగా ఉన్నామని గుర్తు చేశారు.
**500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ విద్య..**
మైక్రోసాఫ్ట్, తెలంగాణ ప్రభుత్వం భాగస్వామ్యంతో రాష్ట్రంలో 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ విద్యను ప్రవేశపెట్టబోతున్నామని ప్రకటించారు. అలాగే గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించనున్నాయని తెలిపారు. ఈ పెట్టుబడి మా స్టార్టప్ ఎకో సిస్టమ్ బలోపేతం చేయడంతోపాటు మెంటార్షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్ ను ఇస్తుందన్నారు. మా ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తున్నందుకు గర్వంగా ఉందని సీఎం అన్నారు. ఈ కేంద్రం ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల మీ నిబద్ధత మా తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్ తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది.

# బీఆర్ఎస్ కు డ్యామేజీ



- వరుస వివాదాల్లో కేటీఆర్ సన్నిహితులు
- గులాబీ దళంలో అయోమయం

**మహా, హైదరాబాద్:** బీఆర్ఎస్ హయాంలో అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతుండగా తాజాగా కోడిపందేల వ్యవహారం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. అసలే అధికారం కోల్పోయి గడ్డు పరిస్థితుల్లో ఉన్న బీఆర్ఎస్‌పార్టీకి ఆ పార్టీ నేతలపై వస్తున్న ఆరోపణలు ఇప్పుడు మరింత చిక్కుల్లో పడేస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో తీగ లాగితే డొంకంతా కదులుతుండగా.. మరోపక్క తోల్‌కట్ట ఫామ్ హౌస్ వ్యవహారంలో ఎలాంటి సంచలనాలు వెలుగు చూడబోతున్నాయనేది ఉత్కంఠ రేపుతున్నది.
**అందరూ కేటీఆర్ సన్నిహితులే..**
రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ లోని ఫామ్ హౌస్‌లో కోడి పందేలు, క్యాసినో కేసు వ్యవహారంలో ఆ పార్టీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి కి గురువారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. అయితే ఈ కేసులో ఇప్పటికే ఏ1గా ఉన్న భూపతిరాజు శివకుమార్ అలియాస్ గబ్బర్ సింగ్ కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడు అనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. మరోవైపు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఎమ్మెల్సీ పోచంపల్లికి సైతం తాజాగా పోలీసులు నోటీసులు ఇవ్వడం దుమారం రేపుతోంది. ఇటీవలే కేటీఆర్ బామ్మర్ది జన్వాడ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించారనే అభియోగాలు రాష్ట్రంలో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఇంతలో ఇప్పుడు కేటీఆర్ సన్నిహితుడు పోచంపల్లి శ్రీనివాస్రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేయడంతో బీఆర్ఎస్ పార్టీకి మరో మచ్చ అంటుకుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
**పోలీసుల చేతిలో పక్కా ఆధారాలు..**
మొయినాబాద్ మండలం తోల్‌కట్టలో గ్యాంబ్లింగ్‌కు అడ్డాగా మారిన ఫామ్ హౌస్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి చెందినదిగా తెలుస్తోంది. సర్వే నంబర్ 165లో 11 ఎకరాలకు పైగా భూమిని అప్పట్లో చెన్నకేశవులు. అనే వ్యక్తి నుంచి పోచంపల్లి కొనుగోలు చేసినట్లు రెవెన్యూ రికార్డులను బట్టి స్పష్టం అవుతోంది. అయితే ఆ ఫామ్ హౌస్‌ను పోచంపల్లి నుంచి శివకుమార్ అనే వ్యక్తి లీజుకు తీసుకుని కోడిపందేలు, క్యాసినో వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చినట్లు సమాచారం. అయితే ఈ ఫామ్ హౌస్‌ను పోచంపల్లి లీజుకు ఇచ్చానని చెబుతున్నా పోలీసులు తమ విచారణలో పక్కా ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. దాదాపు రెండేళ్లుగా ఇక్కడ కోడిపందేలు, క్యాసినో నిర్వహిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.




# ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డికి నోటీసులు

**మహా, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి బిగ్ షాక్ తగిలింది. ఫామ్‌హౌస్‌లో కోడి పందేల నిర్వహణకు సంబంధించి మొయినాబాద్ పోలీసులు ఆయనకు గురువారం నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో తెలంగాణాలో మరోసారి రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. హైదరాబాద్ నగర శివారు మొయినాబాద్‌లోని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌కు చెందిన ఫామ్ హౌస్‌లో కోడి పందేల నిర్వహణ తీవ్ర కలకలం రేపింది. క్యాసినో, కోడి పందాలు ఆడుతున్న వారిని రాజేంద్రనగర్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 64 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఆర్గనైజర్లు భూపతి రాజు, శివకుమార్ కూడా ఉన్నారు. కాగా, ఫామహౌస్‌ను శివ కుమార్ వర్మ లీజ్‌కు తీసుకున్నట్టు తెలుస్తోంది.